సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



ఆలయాల్లో వన మహోత్సవం

ఉమ్మడి జిల్లాలోని దేవాలయాలు, దేవాలయ భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.80 అడుగులు
ఇన్‌ఫ్లో	: 49,013 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 49,013 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,029 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9,217 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 8,367 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	622.21 అడుగులు
ఇన్‌ఫ్లో	: 622.21 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 921 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 238.95 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 167.26 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

లోకాయుక్తకు ఫిర్యాదు

యాదగిరిగుట్ట రూరల్ : రాష్ట్ర భూపరిపాలన విభాగం కమిషనర్ నవీన్ మిట్టల్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జెండగేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. యాదగిరిగుట్ట మండలం రామాజీపేటకు చెందిన మక్కల దుర్గయ్య సోమవారం లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ నర్సింగరావు యాదగిరిగుట్ట మండలంలో ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తూ అనేక అవకతవకలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. నర్సింగరావును బదిలీ చేయాలని భూ పరిపాలన విభాగం కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఏడాది గడిచినా వారినుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. భూ పరిపాలన కమిషనర్, కలెక్టర్‌పై చర్యలు తీసుకుని, డిప్యూటీ తహసీల్దార్‌ను బదిలీ చేయాలని కోరారు.

నేడు జాతీయ షెడ్యూల్డ్ కమిషన్ సభ్యుడి రాక

భువనగిరి టౌన్ : జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం బీబీనగర్ ఎయిమ్స్‌ను సందర్శించి ఉద్యోగులతో సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం బస్వాపురం రిజర్వాయర్‌ను సందర్శిస్తారని, అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం కానున్నారని తెలిపారు.

గుట్ట ఆర్టీసీ డిపో కార్మికుడికి పురస్కారం



ఉత్తమ మెకానిక్‌గా అవార్డు అందుకుంటున్న లింగస్వామి

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో గ్యారేజీలో విధులు నిర్వహిస్తున్న ఎం.లింగస్వామికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ మెకానిక్ అవార్డు దక్కింది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సంస్థ అందజేసే ప్రగతి పురస్కారాల్లో భాగంగా లింగస్వామికి అవార్డు వచ్చినట్లు డిపో అధికారులు తెలిపారు. లింగస్వామిని డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు అభినందించారు.

శివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చన



శివాలయంలో స్పటికలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ప్రధానాలయంలో ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, ఆరాధన, అభిషేకం, అర్చన చేశారు. అనంతరం ప్రాకార మండపం, ఆలయ ముఖ మండపంలో స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం, శ్రీసుదర్శనహోమం, గజవాహన సేవ, జోడు సేవ తదితర కైంకర్యాలు గావించారు.

'ఆరుట్ల' స్ఫూర్తితో భూ పోరాటాలు

ఆలేరురూరల్: తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన ఆరుట్ల రామచంద్రారెడ్డి స్ఫూర్తితో భూపోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. సోమవారం ఆలేరు మండలం కొలనుపాకలో ఆలేరు, రాజాపేట మండలాలకు చెందిన పార్టీ నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆలేరు ప్రాంతంలో దళితులు, పేదల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసం చేశారని ఆరోపించారు. వాటిపై అధికారులకు ఫిర్యాదులు కూడా అందాయని, ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గంధమల్ల రిజర్వాయర్, బునాదిగాని కాలువలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. జనగాం రిజర్వాయర్ ద్వారా గుండాల మండలానికి నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఆరుట్ల సుశీల, చెక్క వెంకటేష్, కొల్లూరు రాజయ్య, కనకయ్య పాల్గొన్నారు.



చిన్ని కృష్ణులు, చిన్నారి గోపికలు

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రామన్నపేటలోని పాఠశాలలో గోపికలు, చిన్ని కృష్ణుల వేషధారణలో చిన్నారులు

జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో నేడు ఫోన్‌ఇన్

గ్రామాలు, పట్టణాల్లో వైరల్ ఫీవర్ కేసులు భారీగా నమోదవుతున్నాయి. జ్వరం తగ్గినా బాధితులు నీరసించి పోతున్నారు. ఈక్రమంలో వైద్య సలహాల కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావుతో మంగళవారం 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. బాధితులు నేరుగా ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు



రాజారావు, జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్

తేది. 27.08.2024 మంగళవారం
సమయం : ఉదయం 11.00 నుంచి 12.00 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :
98490 10915

బదిలీల్లేవు.. ప్రమోషన్లు రావు!

ఏళ్లతరబడి మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల నిరీక్షణ

- 11 సంవత్సరాలుగా ఒకే చోట విధులు
- గత ఏడాది షెడ్యూల్ విడుదలైనా కోర్టు కేసుతో నిలిచిపోయిన ప్రక్రియ



భువనగిరి : మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులకు నోచుకోవడం లేదు. ఒకే చోట 11 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. గత ఏడాది బదిలీల షెడ్యూల్ విడుదలైనా కోర్టు కేసుతో ప్రక్రియ నిలిచిపోయింది. అన్ని శాఖల్లో బదిలీలు, పదోన్నతులు జరుగుతున్నా ప్రభుత్వం తమ గురించి ఆలోచించడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2013లో నియామకం

జాతీయ విద్యా విధానంలో భాగంగా 2013–14 విద్యా సంవత్సరంలో మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఏడు మోడల్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 140 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరంతా 2013లో నియామకమైనా ఇప్పటి వరకు బదిలీలు, పదోన్నతులు పొందలేదు. గత ఏడాది బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినంది. టీజీటీలు, పీజీటీలు వెబ్ ఆప్షన్లు ఇచ్చిన తర్వాత కొంత మంది ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలు జరగడంతో మోడల్ స్కూళ్ల టీచర్లలోనూ ఆశలు చిగురించాయి. కానీ, ఇప్పటి వరకు ప్రభుత్వ బదిలీల ప్రస్తావన తేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

అర్హత ఉన్నా దక్కని పదోన్నతులు

బదిలీలు, పదోన్నతులు చేపట్టకపోవడంతో టీజీటీలు పీజీటీలుగా, పీజీటీలు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి పొందలేకపోతున్నారు. ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్న తమను కూడా బదిలీ చేయాలని, పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. అంతేకాకుండా మోడల్ స్కూళ్లకు సంబంధించి జోనల్ పోస్టులు కావడం వల్ల కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు.

ప్రభుత్వం చొరవచూపాలి



మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి హైకోర్టులో తీర్పు రిజర్వ్‌లో ఉంది. ఈ విషయంపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. 11 ఏళ్ల క్రితం లోతుకుంట పాఠశాలలో నియామకమైనా ఒకే చోట పని చేయాల్సి వస్తుంది. బదిలీలు చేయడంతో పాటు అర్హులకు పదోన్నతులు కల్పించాలి.

-గోరెట్ల రాము, ప్రిన్సిపాల్, లోతుకుంట, వలిగొండ మండలం

నష్టపోతున్నాం



బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియ కోర్టు రిజర్వులో ఉంచింది. ప్రభుత్వం చొరవచూపి సమస్యను పరిష్కరించాలి. 11 సంవత్సరాలుగా ఒకే చోట పని చేస్తున్నాం. బదిలీలు, ప్రమోషన్ల విషయంలో నష్టపోతున్నాం. మా ఇబ్బందులను కూడా ప్రభుత్వం గుర్తించాలి.

- కాసాని దీప, ప్రిన్సిపాల్, లక్కారం, చౌటుప్పల్ మండలం

నేడు యాదాద్రికి గవర్నర్ రాక

- నృసింహుడికి పూజలు.. విరాళాల సేకరణ కార్యాలయం ప్రారంభం
- 29న మరోసారి రానున్న జిష్ణుదేవ్ వర్మ
- కొలనుపాక, స్వర్ణగిరి క్షేత్రాల సందర్శన
- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

సాక్షి, యాదాద్రి : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జిల్లాలో రెండు రోజులు పర్యటించనున్నారు. మంగళవారం యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన విరాళాల సేకరణ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. తిరిగి 29న మరోసారి జిల్లాకు విచ్చేసి కొలనుపాక, స్వర్ణగిరి క్షేత్రాలను సందర్శించనున్నారు. అదే విధంగా వివిధ రంగాల్లో ప్రత్యేకంగా రాణిస్తున్న వారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవార్డు గ్రహీతలతో కలెక్టరేట్‌లో సమావేశం కానున్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రోడ్డు మార్గం ద్వారా యాదాద్రికి..

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా యాదగిరిగుట్ట కొండపైకి ఏడు గంటలకు చేరుకుంటారు. గవర్నర్‌కు ఆలయ మర్యాదలతో దేవస్థానం అర్చకులు, అధికారులు, జిల్లా యంత్రాంగం స్వాగతం పలుకుతారు. గర్భాలయంలో శ్రీస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో గవర్నర్ పాల్గొంటారు. అనంతరం గవర్నర్‌కు అర్చకులు వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేస్తారు. అనంతరం కొండపై ఇటీవల ప్రారంభించిన విష్ణుపుష్కరిణి సందర్శిస్తారు. అలాగే కొండపై శ్రీ స్వామివారికి భక్తులు అందజేసే విరాళాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. సుమారు 45 నిమిషాల పాటు కొండపైన గవర్నర్ గడపనున్నారు. అనంతరం ములుగు జిల్లా పర్యటకు బయలుదేరి వెళ్తారు.

బ్రేక్ దర్శనం వేళల్లో మార్పు

గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఉదయం బ్రేక్ దర్శనం వేళలను దేవస్థానం అధికారులు మార్పు చేశారు. 10 గంటల నుంచి 10.30 వరకు భక్తులు దర్శనం చేసుకోవచ్చు. అలాగే ప్రతి మంగళవారం స్థానిక భక్తులకు కల్పించే ప్రత్యేక దర్శనం సమయాన్ని కూడా మార్పు చేసినట్లు దేవస్థానం ఈఓ భాస్కర్ రావు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.

29న మలివిడత పర్యటన

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈనెల 29న రెండోసారి జిల్లా పర్యటకు రానున్నారు. మధ్యాహ్నం జనగామ జిల్లా నుంచి బయలుదేరి యాదాద్రి జిల్లాకు చేరుకుంటారు. తొలుత ఆలేరు మండలం కొలనుపాకలోని శ్రీసోమేశ్వర ఆలయం, జైన దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలో పాల్గొంటారు. అనంతరం భువనగిరిలోని స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఆ తరువాత కలెక్టరేట్‌లో అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అవుతారు. వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులతో కలిసి ముఖాముఖి చర్చిస్తారు. అనంతరం రాజ్‌భవన్‌కు తిరుగుపయనం అవుతారు.

ప్రత్యేక ఏర్పాట్లు

గవర్నర్ పర్యటన సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. వివిధ శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పటిష్ట బందోబస్తు

గవర్నర్ పర్యటన సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టింది. రోడ్డు మార్గంలో పర్యటన సాగుతున్నందున గవర్నర్ కాన్వాయ్‌కు ఎలాంటి అవాంతరాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

గవర్నర్ పర్యటన ఇలా..

- 27వ తేదీ ఉదయం 7గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గంలో యాదగిరిగుట్టకు బయలు దేరుతారు.
- 8 గంటలకు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకుంటారు. సుమారు 45 నిమిషాల పాటు ఉంటారు. 8.45కి యాదగిరిగుట్టనుంచి ములుగు జిల్లాకు బయలుదేరి వెళ్తారు.
- 29న మధ్యాహ్నం 2.20 గంటలకు జనగామ జిల్లా ఓబుల్ కేశవాపూర్ నుంచి జిల్లాలోని కొలనుపాక చేరుకుంటారు.
- 2.45 వరకు కొలనుపాక జైన దేవాలయం, శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో ఉంటారు.
- 3 గంటలకు కొలనుపాక నుంచి బయలు దేరి 3.30కి భువనగిరి శివారులోని స్వర్ణగిరి క్షేత్రాన్ని సందర్శిస్తారు.
- 4 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ 4.15 నుంచి 5.15 వరకు జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అవుతారు.
- 5.15 నుంచి 7గంటల వరకు కలెక్టరేట్‌లో కవులు, కళాకారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ రంగాల్లో అవార్డులు అందుకున్న సుమారు 20 మందితో సమావేశం కానున్నారు.
- 7 గంటలకు కలెక్టరేట్ నుంచి రాజ్‌భవన్‌కు తిరుగుపయనం అవుతారు.

కుళ్లిన కోడిగుడ్లపై విచారణ

- కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ.. అంగన్‌వాడీ సిబ్బందికి మెమోలు



భువనగిరిటౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో తరచూ కుళ్లిన కోడిగుడ్లు వెలుగుచూస్తున్న ఘటనలపై రాష్ట్ర సంక్షేమ శాఖ అధికారులు స్పందించారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి కేటీఆర్ కూడా ట్విట్టర్‌లో పేర్కొనడంతో విచారణకు ఆదేశించారు. కుళ్లిన కోడిగుడ్లు రావడానికి గల కారణాలపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. అంతేకాకుండా కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చారు. అలాగే కుళ్లిన కోడిగుడ్లు వెలుగుచూసిన భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని ముదిరాజ్‌వాడకు చెందిన అంగన్‌వాడీ కేంద్రం టీచర్, ఆయా, సూపర్‌వైజర్‌కు మెమోలు జారీ చేశారు.

నేడు ఆయాలకు శిక్షణ

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పాలు, గుడ్లు, పౌష్టికాహారం పంపిణీపై ఆయాలకు మంగళవారం శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి తెలిపారు. పౌష్టికాహారం పంపిణీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆలేరు, భువనగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని ఆయాలు విధిగా శిక్షణ తరగతులకు హాజరుకావాలని సూచించారు.

మదర్ డెయిరీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని నల్లగొండ – రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సమాఖ్య(నార్మూల్ మదర్ డెయిరీ)లో డైరెక్టర్ల ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 30తో పదవీ కాలం ముగియనున్న మూడు స్థానాలు, గతంలో వాయిదా పడిన మరో మూడు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి సోమవారం తెలిపారు. సెప్టెంబర్ 4న ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 5న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నామినేషన్ల పరిశీలన, అర్హత సాధించిన నామినేషన్ల ప్రకటన, 6న ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపసంహరణ ఉంటుందని పేర్కొన్నారు. ఆ తర్వాత పోటీలో ఉన్నవారి పేర్లను ప్రకటిస్తామని ఎన్నికల అధికారి చెప్పారు. ఏకగ్రీవమైన స్థానాల్లో సదరు అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని, సెప్టెంబర్ 13న హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాలులో ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు నిర్వహిస్తామని, మరుసటి రోజు ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. అనంతరం పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసి చైర్మన్‌ను ఎన్నిక నిర్వహిస్తామని పేర్కొన్నారు.

తొమ్మిది జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీ

- వివరాలు ప్రకటించిన విద్యాశాఖ
- రెండు రోజుల్లో భర్తీ

భువనగిరి : జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న తొమ్మిది గెజిటెడ్ హెచ్‌ఎం(జీహెచ్‌ఎం) పోస్టులను భర్తీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. స్కూల్ అసిస్టెంట్లకు (ఎస్‌ఏ) పదోన్నతి కల్పించి భర్తీ చేయనున్నారు. ఇప్పటికే సీనియార్టీ జాబితాతో పాటు ఖాళీల వివరాలను ప్రకటించారు. వెబ్ ఆప్షన్‌కు అవకాశం కల్పించి, రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయనున్నారు. కాగా మొదటి విడతగా జూన్‌లో ఎస్‌ఏలకు పదోన్నతి కల్పించి జీహెచ్‌ఎం పోస్టులను భర్తీ చేసిన విషయం తెలిసిందే. కానీ, కొందరు పదోన్నతిపై అసక్తి చూపలేదు. వీరితో పాటు పదోన్నతి పొందిన ఎస్‌ఏలు జూన్, జూలై నెలలో ఉద్యోగ విరమణ చేశారు. ఫలితంగా తొమ్మిది జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీ అయ్యాయి.

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు





బాలుర, బాలికల విభాగాల్లో తలపడుతున్న క్రీడాకారులు

భువనగిరి : జిల్లా కేంద్రంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న అండర్–18 అంతర్జాతీయ టెన్నిస్ క్రీడా పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. బాలికలు, బాలుర విభాగంలో వివిధ దేశాల మధ్య క్వాలిఫైయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీఎఫ్ సూపర్‌వైజర్ శివకుమార్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, శివానిరెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల విభాగంలో..

సాన్వి మిశ్రా(ఇండియా), సావర్ణిక విననక్రా(ఇండియా)పై 2–6, 6–0, 12–10తో గెలుపొందారు. దీప్తి వెంకటేశన్(ఇండియా), ప్రభుదేశాయ్, దేవాన్షి(ఇండియా)పై 6–1,6–3, కీర్తన(ఇండియా), అరవింద్ మీరా(ఆస్ట్రేలియా)పై 6–0,7–5, శ్రేణితి చౌదరి (ఇండియా), రంగినేని కీర్తన (ఇండియా)పై 6–2,6–3, సౌమ్య ఛటర్జీ(ఇండియా), శ్రీనితి సాయిపటోజు (ఇండియా)పై 6–0,6–0తో విజయం సాధించారు. అదితి పాతూరి(అమెరికా), మందగళ్ల ప్రిన్సి(ఐఎస్‌డీ)పై 1–0 తేడాతో గెలుపొందారు.

బాలుర విభాగంలో..

అభిరామ్(ఇండియా), సిద్ధార్థ(ఇండియా)పై 6–1,6–2, మేడం వీర్(ఇండియా), అనురన్(ఇండియా)పై 6–1, 6–2, యశ్వంత్(ఇండియా), శివకుమార్ నితిక్(ఇండియా)పై 6–2, 6–4, అనికేత్ రాయ్(ఇండియా), మన్నురెడ్డి తోట(యూఎస్‌ఏ)పై 6–4,7–6 తేడాతో గెలుపొందారు.

నాలుగు దశాబ్దాలుగా నరకం!

మునిపంపుల- లక్ష్మాపురం గ్రామాలకు మట్టిరోడ్డే దిక్కు

- వర్షం వస్తే కాలినడకనా వెళ్లలేని దుస్థితి
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- బీటీ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి



వర్షాలకు చిత్తడిగా మారిన మునిపంపుల- లక్ష్మాపురం రహదారి



బురదలోనుంచి నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

రామన్నపేట : మండలంలోని మునిపంపుల – లక్ష్మాపురం గ్రామాల రహదారి అధ్వానంగా మారింది. గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచి నడిచేందుకు వీలులేకుండా దారుణంగా మారింది. దీంతో ఇరు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మునిపంపుల–లక్ష్మాపురం గ్రామాల మధ్య మట్టి రోడ్డు సుమారు 6 కి.మీ దూరం ఉంది. నాలుగు దశాబ్దాల క్రితం ఇరు గ్రామాల మధ్య పీఆర్ అధికారులు మట్టిరోడ్డు నిర్మించారు. రోడ్డు గుండా ఇరు గ్రామాలకు చెందిన రైతులు, గీతకార్మికులు, మత్స్యకారులు, జీవాల పెంపకం దారులు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు.

తాత్కాలిక మరమ్మతులతోనే సరి..

మట్టిరోడ్డు కావడంతో తరుచుగా గుంతలు ఏర్పడుతున్నాయి. రోడ్డు దెబ్బతిన్నప్పుడల్లా అధికారులు మొరంపోసి చేతులు దులుపుకుంటున్నారు. వర్షాకాలంలో రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంటుంది. గుంతల్లో నీరు నిలిచి రాకపోకలు సాగించడానికి వీలులేకుండా ఉంటుంది. చెప్పులు చేతపట్టుకుని నడక సాగించాల్సిన పరిస్థితి ఉంటుంది. వ్యవసాయ బావుల వద్దకు ఎరువులు, విత్తనాలు తీసుకువెళ్లాలంటే రైతులు నరకం చూస్తున్నారు. ఈ మార్గంలోనే మునిపంపుల ఆవాస గ్రామమైన బోటిమీది గూడెం ఉంటుంది. గ్రామస్తులు నిత్యం బురదమయమైన దారిగుండానే నడిచి వెళ్లాల్సి వస్తుంది. బస్సులు కూడా లేకపోవడంతో ఆవాస గ్రామానికి చెందిన విద్యార్థులు బురద గుంటలు దాటుకుంటూ బడికి వెళ్తున్నారు. పీఎంజీఎస్‌వై కింద బీటీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదు. రోడ్డుకు బీటీ వేయాలని, అవసరమైన చోట సీసీగా మార్చాలని ఇరుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీ వేయాలి



మునిపంపుల గ్రామానికి చెందిన సగానికి పైగా కుటుంబాలు ఈ రోడ్డుగుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. కొద్దిపాటి వర్షం కురిసిన రోడ్డంతా బురదమయం అవుతుంది. వ్యవసాయబావుల వద్దకు వెళ్లడానికి చాలా ఇబ్బంది అవుతుంది. అన్నివర్గాల ప్రజలం ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా పాలకులు స్పందించి బీటీ, సీసీ వేయాలి.

– గునుగుంట్ల సత్యనారాయణ, రైతు, మునిపంపుల, రామన్నపేట మండలం

క్లుప్తంగా

యాదాద్రిలో వ్యవసాయ శాఖ సెక్రటరీ పూజలు



రఘునందన్‌రావుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్‌రావు తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు.

జూదరుల అరెస్ట్

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని బంగారిగడ్డ కాలనీ శివారులో పేకాట శిబిరంపై ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.41వేల నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దేవాలయాల్లో వన మహోత్సవం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న కార్యక్రమం
- ఆలయ పరిసరాలు, నాన్ అగ్రికల్చర్ భూముల్లో మొక్కలు నాటుతున్న దేవాదాయ శాఖ సిబ్బంది



చింతలపాలెం మండలం చిత్రియాల గ్రామంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆలయ సిబ్బంది తదితరులు

రామగిరి(నల్లగొండ): రాష్ట్రంలో పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. భవిష్యత్ తరాలకు పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణం అందించాలనే ఆలోచనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో, దేవాలయ భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది. ఆయా జిల్లాల కలెక్టర్ల ఆదేశాల మేరకు మొక్కలు నాటేందుకు దేవాదాయ శాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు ప్రణాళికతో దేవాదాయ శాఖ అధికారులు ముందుకు సాగుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి నల్లగొండ దేవాదాయ శాఖ పరిధిలో నల్లగొండ జిల్లాలో 844, యాదాద్రి భువనగిరి జిల్లాలో 617, సూర్యాపేట జిల్లాలో 432, జనగామ జిల్లాలో 302 ఆలయాలు ఉన్నాయి. అన్ని జిల్లాల్లోని ఆలయ పరిసరాల్లో ఖాళీగా ఉన్న భూమితో పాటు వ్యవసాయేతర బీడు భూముల్లో మొక్కలు నాటాలని దేవాదాయల శాఖ ఈఓలకు సూచించింది. దీనిలో భాగంగా ఇప్పటి వరకు నల్లగొండ జిల్లాలో 1000, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2500, సూర్యాపేట జిల్లాలో 4500 జనగామ జిల్లాలో 368 మొక్కలు నాటారు.

నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటాం



ఆగస్టు 31వ తేదీ వరకు వీలున్నంత వరకు అన్ని దేవాలయాల్లో మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆలయాల్లో మొక్కలు ఉంటే దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. అన్ని ఆలయాల్లో మొక్కలు నాటాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు దేవాదాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. – అన్నెపల్లి సులోచన, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

గిరిజనుల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.350 కోట్లు



సమీక్షలో మాట్లాడుతున్న బెల్లయ్యనాయక్



బెల్లయ్యనాయక్ సన్మానిస్తున్న గిరిజన నేతలు

- రాష్ట్ర ఎస్టీ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్

నల్లగొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.350 కోట్లు కేటాయించిందని రాష్ట్ర ఎస్టీ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్యనాయక్ అన్నారు. సోమవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలో షెడ్యూల్ తెగల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గిరిజన సంక్షేమ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ తెగల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పర్యటించి గిరిజనుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామన్నారు. 30వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి గిరిజన సంఘాల నాయకులతో చర్చించి వారి అభిప్రాయాన్ని, 31వ తేదీన గిరిజన ప్రజాప్రతినిధులతో సమీక్షించనున్నట్లు తెలిపారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.350 కోట్ల నిధుల వినియోగానికి ఎలాంటి ప్రతిపాదనలు సిద్ధం చేయాలో సెప్టెంబర్ 4న నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆర్థిక చేయూత, చిన్న, మధ్య తరహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రోత్సాహ పథకం, భూమి అభివృద్ధి పథకాల కింద లబ్ధిదారుల ఎంపికకు అక్టోబర్‌లో నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు పూర్తిస్థాయి పట్టాలు, హక్కులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని అన్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారి రాజ్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

బెల్లయ్యనాయక్‌కు సన్మానం..

నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో సోమవారం బెల్లయ్య నాయక్‌ను లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రు నాయక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ.. గిరిజన యువకులకు ఉపాధి అవకాశాలతో పాటు గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, రాంబాల్‌నాయక్, భిక్షం నాయక్, కోటియానాయక్, నాగేశ్వరరావునాయక్, మెగావత్ సురేందర్‌నాయక్, రాజేష్‌నాయక్, రవినాయక్, మంగీలాల్‌నాయక్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

అడ్డగూడూరు: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం అడ్డగూడూరు మండలం బొడ్డుగూడెం గ్రామ స్టేజీ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం డీ.రేపాక గ్రామానికి చెందిన గుండ తరుణ్ తిరుమలగిరి నుంచి డీ.రేపాకకు బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చీకటాయపాలెం గ్రామానికి చెందిన మంగళపల్లి మల్సూర్, వేల్పుకొండ మహేందర్ బైక్‌పై పోచంపల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అడ్డగూడూరు మండలం బొడ్డుగూడెం గ్రామ స్టేజీ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మల్సూర్, మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా.. ఘటన స్థలానికి సమీపంలో 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు వెంకన్న, సైదులు అక్కడకు చేరుకుని మల్సూర్, మహేందర్‌ను పోలీసు పెట్రోలింగ్ వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. మోటకొండూర్ మండలం చాడ గ్రామం వరకు పోలీసులు తీసుకెళ్లిన తర్వాత అక్కడ నుంచి 108 వాహనంలో క్షతగాత్రులను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. తరుణ్‌కి స్వల్ప గాయాలు కాగా ప్రైవేట్ వాహనంలో తిరుమలగిరికి తరలించారు.

డెంగీతో మృతి



ఉపేందర్ (ఫైల్)

తుంగతుర్తి: మండలంలోని గొట్టిపర్తి గ్రామానికి చెందిన వ్యక్తి డెంగీతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టిపర్తి గ్రామానికి చెందిన రామగిరి ఉపేందర్ (59) బతుకుదెరువు నిమిత్తం భార్య, కుమారుడితో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు వలస వెళ్లాడు. వారం రోజుల క్రితం ఉపేందర్ తీవ్రమైన జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి డెంగీ సోకిందని చెప్పారు. కొద్దిరోజులు అక్కడ చికిత్స పొందిన తర్వాత కూడా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు సూచించారు. దీంతో ఆదివారం ఉపేందర్‌ను కుటుంబ సభ్యులు స్వగ్రామమైన గొట్టిపర్తికి తీసుకురాగా రాత్రి మృతిచెందాడు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో.. డ్రైవర్ మృతి



సురేష్ (ఫైల్)

గుర్రంపోడు: ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామ శివారులోని రాచకాల్వ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన భూతరాజు సురేష్(30) ఆటోలో ఉప్పు బస్తాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున మల్లేపల్లి నుంచి గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామం వైపు ఆటోలో వస్తున్నాడు. అదే సమయంలో గుమ్మడవల్లికి వెళ్తున్న ట్రాక్టర్ మరమ్మతులకు గురై పాల్వాయి గ్రామ శివారులోని రాచకాల్వ సమీపంలో రోడ్డుపై ఆగి ఉంది. ఇది గమనించని సురేష్ ఆటోతో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సురేష్ ఫోన్ ద్వారా తన సోదరుడు సైదయ్యకు ప్రమాదం జరిగిన విషయం తెలియజేశాడు. సైదయ్య వెంటనే కారులో ఘటనా స్థలానికి చేరుకుని సురేష్‌ను దేవరకొండలోని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి సోదరుడు సైదయ్య ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



లక్ష్మి (ఫైల్)

చందంపేట: విద్యుదాఘాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ సోమవారం మృతిచెందింది. చందంపేట మండలం పొగిళ్ల గ్రామంలో ఈ నెల 20వ తేదీన హనుమాన్ ఊరేగింపు నిర్వహిస్తుండగా గ్రామానికే చెందిన జటావత్ లక్ష్మి(45) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. గ్రామస్తులు వెంటనే ఆమెను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. కూలీ పనిచేస్తూ జీవనం సాగించే లక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చిట్యాల: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తుల చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం చిట్యాల పట్టణంలో వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయం సమీపంలో నివాసముంటున్న సునీత ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. సోమవారం ఆమె తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. వెంటనే చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు కోదాడ లారీ అసోసియేషన్ ఎన్నికలు



బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేస్తున్న ఎన్నికల నిర్వాహకులు

కోదాడరూరల్: కోదాడ లారీ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. కోదాడ పట్టణ శివారులోని కోదాడ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించి సాయంత్రానికి ఫలితాలు వెల్లడించనున్నారు. అసోసియేషన్‌లో మొత్తం 396 మంది సభ్యులున్నారు. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు రఘుప్రసాద్ వ్యవహరించనున్నారు. 2024–26 కాలానికి లారీ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి పదవులకు రెండు ప్యానెల్స్‌లో పలువురు పోటీపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు ఉన్న లారీ అసోసియేషన్‌లలో ఒకటైన కోదాడ లారీ అసోసియేషన్ పాలకవర్గాన్ని చేజిక్కించుకునేందుకు రెండు ప్యానెల్‌లోని నాయకులు ప్రయత్నిస్తుండటంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఎవరికి వారే తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఎత్తులు వేస్తుండటంతో ఈ ఎన్నికలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

బహిరంగ ప్రకటన

... Balu Mahender, S/o. Balu Narsaiah, R/o. H.No. 1-6-176, Bhargavapuram, Alair Town and Mandal, Yadadri Bhuvanagiri District ...

Y. CHANDRA RUSHI, B.Sc., LL.B., Advocate
#1-2-273, Opp: Court Building, Brundavan Colony, JANGAON. Dist: Jangaon, Cell: 9848430925

బహిరంగ ప్రకటన

... Bounded by: East: ... West: Open place of Burugu Santhosh Reddy, North: House of Burugu Venkat Reddy, South: House of Pachimatla Anjaneyulu

Y. CHANDRA RUSHI, B.Sc., LL.B., Advocate
#1-2-273, Opp: Court Building, Brundavan Colony, JANGAON. Dist: Jangaon, Cell: 9848430925



సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ డిమార్ట్ మిర్యాలగూడ సమీపంలో నెం. 1 గేటెడ్ కమ్యూనిటీ. 3 BHK లగ్జరీ విల్లాలు నివసించుటకు సిద్ధం! క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్. తప్పక చూడండి! సంప్రదించండి: 08069045560 [HA-519]

Services

CHANGE OF NAME

■ THANGELLA RAMU S/o Lingaiah Asst. Linemen (TSSPDCL) at Karivirala Nadigudem Mandal, Suryapet Dist. Shall henceforth be known as THANGELLA RAMACHANDAN S/o Lingaiah For the purpose of Correction of worng entries occurred in school Records due to parental mistakes. Signature THANGELLA RAMU Station Munagala. Date: 20.08.2024 [Y-798469]

Wanted

■ శ్రీ లక్ష్మీ హోం కేర్ : హైదరాబాద్ నందు వృద్ధులకు పేషంట్లకు సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి/వంటపనికి స్త్రీ/పు కావలెను. జీతం: 17,000 రూం+మీల్స్ ఫ్రీ. 9347148051 [G-2159]

ప్రకటన కొరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740
9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

దేవరకొండ: బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డుపై నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొట్టి మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి దేవరకొండ మండల పరిధిలోని బొల్లిగుట్టతండా సమీపంలో జరిగింది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం గిరిజానగర్‌తండాకు చెందిన ఇస్లావత్ నరేష్(21), సబావత్‌తండాకు చెందిన రాహుల్ (18) డీజే ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. ఆదివారం డిండి మండలంలో ఓ శుభకార్యానికి డీజే తీసుకెళ్లారు. శుభకార్యం పూర్తయిన తర్వాత వారిద్దరు బైక్‌పై తూర్పుపల్లి మీదుగా స్వగ్రామాలకు వెళ్తుండగా.. దేవరకొండ మండల పరిధిలోని బొల్లిగుట్టతండా సమీపంలోకి రాగానే రోడ్డుపై నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నరేష్, రాహుల్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వారిని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా నరేష్ మార్గమధ్యలో మృతిచెందాడు. రాహుల్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాతకక్షలతో ఇద్దరిపై దాడి

ఆత్మకూరు (ఎస్): పాతకక్షలను మనసులో పెట్టుకొని ఇద్దరు వ్యక్తులపై మద్యం సీసాలతో మరో ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన ఆత్మకూరు (ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెమ్మికల్ గ్రామానికి చెందిన పెద్దింటి సైదులు, వేల్పుల వంశీపై అదే గ్రామానికి చెందిన వీరబోయిన భరత్, కొడిదల వంశీ మధ్య ఏడాది క్రితం గొడవ జరిగింది. ఆదివారం గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా భరత్, కొడిదల వంశీ మద్యం తాగడానికి సాయంత్రం ఆత్మకూర్(ఎస్) శివారుకు వచ్చారు. అదే సమయంలో సైదులు, వేల్పుల వంశీకి ఫోన్ చేసి మాట్లాడుకుందాం అని పిలిపించారు. వారిద్దరు అక్కడకు రాగానే భరత్, కొడిదల వంశీ మద్యం సీసా పగులగొట్టి సైదులు, వేల్పుల వంశీపై దాడి చేశారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట చేసినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపినట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దిరాల: అక్రమంగా తరలిస్తున్న 23క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం మద్దిరాల మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండల కేంద్రానికి చెందిన కాసం వీరభద్రయ్య నకిరేకల్ చుట్టపక్కల గ్రామాలు, తండాల్లో 23క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి డీసీఎంలో మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో గల రాజరాజేశ్వరీ రైస్ మిల్లు వద్ద మేకపోతుల గోవర్ధన్‌రెడ్డికి అధిక ధరకు అమ్మడానికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో మద్దిరాల మండలం కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు డీసీఎంలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. డీసీఎంను, రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. కాసం వీరభద్రయ్యతో పాటు మేకపోతుల గోవర్ధన్‌రెడ్డి, డీసీఎం డ్రైవర్, డీసీఎం యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

నాగారం: కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలయ్యాయి. ఈ ఘటన నాగారం మండల కేంద్రంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల కేంద్రానికి చెందిన నూక నర్సమ్మ ఇంట్లోకి సోమవారం కోతుల మంద చొరబడి వండిన ఆహార పదార్థాలు తింటున్నాయి. ఇది గమనించిన నర్సమ్మ కర్రతో కోతుల మందును వెళ్లగొట్టే ప్రయత్నం చేయగా కోతుల మంద ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. దీంతో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి కోతుల మందును వెళ్లగొట్టారు. నర్సమ్మ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు బాధితురాలిని చికిత్స నిమిత్తం నాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం నాగారం మండల కేంద్రానికే చెందిన చలమందు, ముత్తమ్మ దంపతులపై కోతులు దాడి చేయగా వారు తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు.

పాతర్లపహాడ్‌లో విషాదఛాయలు

- అమెరికాలో ప్రవీణ్‌కుమార్ మృతితో కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు
- దిగ్భ్రాంతికి గురైన మిత్రులు, కుటుంబ సభ్యులు



రోదిస్తున్న ప్రవీణ్‌కుమార్ తల్లిదండ్రులు

ఆత్మకూర్(ఎస్): మండలంలోని పాతర్లపహాడ్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన తప్సీ ప్రవీణ్‌కుమార్ అమెరికాలోని న్యూ మెక్సికోలో భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం తన ఇంటి సమీపంలోని స్విమ్మింగ్ పూల్ దోబీఘాట్ వద్ద బట్టలు ఉతికేందుకు వెళ్లి అందులో పడి మృతిచెందాడు. ప్రవీణ్‌కుమార్ ఎంతసేపటికి రాకపోగా, ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అతడి భార్య శాంతి స్విమ్మింగ్ పూల్ వద్దకు వెళ్లి చూడగా ప్రవీణ్ కారు మాత్రమే ఉంది. వెంటనే ప్రవీణ్ మిత్రులకు ఫోన్ చేసి పిలిపించింది. శాంతి, ప్రవీణ్ మిత్రులు చుట్టుపక్కల వెతికి చూడగా స్విమ్మింగ్ పూల్‌లో ప్రవీణ్ శవమై కనిపించాడు. పోలీసుల సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టంకు తీసుకెళ్లారు. ప్రవీణ్‌కుమార్ తల్లిదండ్రులు పాతర్లపహాడ్‌లో చిన్న బడ్డీ కొట్టు నిర్వహించుకుంటుండగా.. చిన్నప్పటి నుంచి కష్టపడి చదివిన ప్రవీణ్‌కుమార్ అమెరికాలో విద్యాబోధన చేసే స్థాయికి ఎదిగాడు. అంతలోనే అకాల మరణం చెందడం అతడి మిత్రులను, కుటుంబ సభ్యులను దిగ్భ్రాంతికి గురిచేసింది. తన కుమారుడి మృతదేహాన్ని పాతర్లపహాడ్‌కు తీసుకొచ్చేలా ప్రభుత్వం సహకరించాలని మృతుడి తండ్రి తప్సీ నాగయ్య కోరుతున్నాడు.

అంచెలంచెలుగా ఎదిగి..

పాఠశాల విద్య స్వగ్రామంలో చదివిన ప్రవీణ్‌కుమార్ ఇంటర్, డిగ్రీ సూర్యాపేటలో పూర్తిచేశాడు. భువనగిరిలో ఎమ్మెస్సీ చేశాడు. హైదరాబాద్‌లోని భాష్యం స్కూల్‌లో, సౌదీలోని అబుదాబీలో ప్రైవేట్ టీచర్‌గా పని చేశాడు. 2017లో గుజరాత్‌లోని ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. అమెరికాలో ఉంటున్న గుజరాత్ కుటుంబ సభ్యులకు ట్యూషన్ చెబుతుండేవాడు. ప్రవీణ్ టీచింగ్ టాలెంట్ గుర్తించిన ఆ ఎన్నారై కుటుంబ సభ్యులు అమెరికాలో టీచర్‌గా పని చేయాలని ప్రవీణ్ కుమార్‌ను ప్రోత్సహించారు. వారి సహకారంతో 2019లో అమెరికాకు వెళ్లి అట్లాంటాలో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడకు చెందిన శాంతితో పరిచయం ఏర్పడి ఆర్య సమాజ్‌లో వివాహం చేసుకొని దంపతులిద్దరూ అమెరికాకు వెళ్లిపోయారు. అట్లాంటా నుంచి కొద్దిరోజుల తర్వాత జార్జియాలో పని చేశాడు. ఇటీవల న్యూ మెక్సికోలో స్థిరపడి అక్కడ ప్రైవేట్ పాఠశాలలో విద్యా బోధన కొనసాగిస్తున్నాడు.

తపాలా ఉద్యోగి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులతో ఒంటికి నిప్పంటించుకుని బలవన్మరణం



సురేష్ (ఫైల్)

మీర్‌పేట: తపాలా శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లింగగిరికి చెందిన శీలం కాంతయ్య కుమారుడు శీలం సురేశ్(37) ఆబిడ్స్‌లోని తపాలా శాఖలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య స్వరూప, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాపిల్లలతో కలిసి మీర్‌పేట జిల్లెలగూడలోని లలితానగర్‌లో నివాసముంటున్నాడు. కొంతకాలంగా చేసిన అప్పులు తీర్చలేక సురేశ్ బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో భార్య, పిల్లలు ఇంట్లో ఉండగానే బెడ్‌రూమ్‌లోకి వెళ్లి గడియ పెట్టుకుని, ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలు రావడాన్ని గమనించిన భార్య స్వరూప వెంటనే సమీప బంధువు ప్రసాదరావుకు ఫోన్ చేయగా, అతను వచ్చేసరికి పెద్దఎత్తున మంటలు, పొగలు వ్యాపించాయి. దీంతో 100కు డయల్ చేశారు. సమాచారం అందుకున్న మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజు.. అగ్నిమాపక సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేయగా, అప్పటికే సురేశ్ పూర్తిగా కాలిపోయి మృతిచెందాడు. జీవితంపై విరక్తి చెంది సురేశ్ ఆత్మహత్య చేసుకున్నాడని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

రైల్లో నుంచి దూకి పారిపోయిన బాలిక

- గొల్లగూడ సమీపంలో తిరుగుతుండగా రైల్వే పోలీసులకు అప్పగించిన స్థానికులు

నల్లగొండ క్రైం: ముంబై పోలీసులు ఓ బాలికను రైల్లో సోమవారం విజయవాడకు తీసుకెళ్తుండగా.. నల్లగొండలో రైలు ఆగిన సమయంలో ఆమె రైలులో నుంచి దూకి పారిపోయింది. సదరు బాలిక అక్కడ నుంచి పారిపోయి నల్లగొండ పట్టణంలోని గొల్లగూడలోని అంధుల పాఠశాల సమీపంలో తిరుగుతుండగా స్థానిక యువకులు గుర్తించి కాంగ్రెస్ నాయకుడు అల్లి సుభాష్‌యాదవ్ సమాచారం ఇచ్చారు. ఆయన బాలిక నుంచి వివరాలు రాబడుతుండగా.. రైల్లో నుంచి పారిపోయినట్లు తెలపడంతో వెంటనే రైల్వే పోలీసులకు అప్పగించారు. సదరు బాలిక మానసిక స్థితి సరిగ్గా లేక ముంబైలో తిరుగుతుండగా జూలైలో అక్కడి శాంతాక్రూజ్ పోలీస్ స్టేషన్ పోలీసులు గుర్తించి ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఆ బాలికను కుటుంబ సభ్యుల వివరాల గురించి ప్రశ్నించగా చెప్పలేకపోయింది. ఆమె తెలుగు స్పష్టంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా అని చెప్పడంతో మొదట బాలికను పోలీసులు కర్నూల్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఎలాంటి మిస్సింగ్ కేసులు, బాలిక చెప్పిన వివరాలు సరిపోలకపోవడంతో విజయవాడ చైల్డ్ కేర్ అధికారులకు అప్పగించేందుకు రైలులో తీసుకెళ్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి

- మృతురాలిది సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెం

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం అందనాలపాడుకు చెందిన యువతి అత్తింటి వేధింపులతో ఆత్మహత్య చేసుకుంది. అందనాలపాడు గ్రామానికి చెందిన కనకం మహేందర్‌కు సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెనికి చెందిన మౌనిక(26)తో ఏప్రిల్ 4న వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.10లక్షల ఒప్పుకుని రూ.5లక్షల నగదు, ఐదు తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. కొద్ది రోజుల అనంతరం అదనపు కట్నం కోసం భర్త మహేందర్, అత్త సత్యవతి, ఆడబిడ్డతో పాటు ఇతర కుటుంబ సభ్యులు మౌనికను వేధిస్తున్నారు. ఈ నెల 22న మౌనిక పుట్టి రోజు కాగా అత్తింటివారు రూ.30 లక్షల అదనపు కట్నం తీసుకురావాలని ఒత్తిడి చేశారు. అత్త సత్యవతి మాత్రలు మింగి చావమంటూ బీపీ మాత్రలు మౌనికపై విసిరింది. మనస్తాపానికి గురైన మౌనిక వాటిని తీసుకుని అధిక మోతాదులో మింగడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు మొదట ఖమ్మం తరలించి అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందింది. మృతురాలి తండ్రి నవిలె కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మౌనిక భర్త కనకం మహేందర్, అత్త సత్యవతి, ఆడబిడ్డ స్వప్న, ఆమె భర్త తిరుపతయ్య, బంధువు గోవిందు ఏసు, ఆయన భార్య జయమ్మపై కేసు నమోదు చేసినట్లు సీఐ బి. రాజేశ్ సోమవారం తెలిపారు.